క్లుప్తంగా

సమాచార హక్కు చట్టం బోర్డులు ఏర్పాటు చేయండి

దెంకాడ: మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం బోర్డులు ఏర్పాటు చేయాలని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సంస్థ సభ్యుడు కర్రోతు రాము కోరారు. ఇదే విషయమై మండల తహసీల్దారు, మండల పరిషత్ కార్యాలయం అధికారులకు గురువారం వినతిపత్రం అందజేశారు. గ్రామ స్థాయిలో కూడా ఈ చట్టం పక్కాగా అమలయ్యేలా సచివాలయల్లోనూ సమాచార హక్కు చట్టం వివరాలు ప్రదర్శించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారం

విజయనగరం: నగరంలోని 47వ డివిజన్ వార్డులో నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు గురువారం పర్యటించారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, అక్కడి విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. అలాగే పలు వీధుల్లో పర్యటించి, అక్కడి పారిశుధ్య పరిస్థితులు, ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇదే డివిజన్‌లో రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు చేపడతామని, అలాగే ప్రజాసమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. డివిజన్‌లో కొన్ని సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని, వాటి పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

నెల్లిమర్ల: స్థానిక డైట్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, కమిషనర్ జయరాం గురువారం సందర్శించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య నందివ్వడంతో పాటు పౌష్టికాహారం అందేలా చూడాలని సిబ్బందికి వారు తెలిపారు. జంగిల్స్, ముురుగు ఉండకుండా చూడాలన్నారు.

వినాయక నిమజ్జనంలో జాగ్రత్తలు తప్పనిసరి

నెల్లిమర్ల: వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌ఐ బి.గణేష్ తెలిపారు. స్థానిక పట్టణంలోని వినాయక చవితి ఉత్సవ కమిటీ సభ్యులతో ఎస్‌ఐ గురువారం సమావేశమై పలు సూచనలు చేశారు. మండలంలోని చంపావతి నది వర్షాల కారణంగా ఉధృతంగా ప్రవహిస్తోందని, ఈ క్రమంలో విగ్రహాలను నదిలో నిమజ్జనం చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈతరాని వారు, చిన్నపిల్లలు ఎట్టి పరిస్థితుల్లోనూ నదిలోకి దిగవద్దన్నారు. ఈత వచ్చిన వారు కూడా నదిలోపలికి వెళ్లే సాహసం చేయవద్దన్నారు. అనంతరం ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక



గిరిజా ప్రసన్న

విజయనగరం: జిల్లా కేంద్రానికి చెందిన సముద్రాల గిరిజా ప్రసన్న ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరంలో ఈ నెల 7వ తేదీన పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగే అవార్డుల ప్రదానోత్సవంలో ప్రసన్న ఈ అవార్డు అందుకోనున్నారు. ప్రస్తుతం ఈమె ది వైజాగ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆంగ్ల ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. అవార్డుకు ఎంపికైన నేపథ్యంలో ఆమెకు సిబ్బంది, సహచరులు, బంధుమిత్రుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి.

- విపరీతంగా పెరుగుతున్న ఈ-వేస్ట్
- రీసైక్లింగ్‌పై అధికారుల్లో కొరవడిన శ్రద్ధ
- ప్రజల్లోనూ అవగాహన లోపం
- పర్యావరణానికి హానికరం

ఈ-వ్యర్థం.. నిర్లక్ష్యం చేస్తే అనర్థం!



గుట్టలుగుట్టలుగా పడిఉన్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలు

విజయనగరం: రోజురోజుకూ ఈ-వేస్ట్(ఎలక్ట్రానిక్ వ్యర్థాలు) విపరీతంగా పెరిగిపోతోంది. అందరూ అవసరాల నిమిత్తం ఎలక్ట్రానిక్ ఉపకరణాలు అధికంగా వినియోగిస్తుండడంతో ఈ-చెత్త ఎక్కువవుతోంది. పనికిరాకుండా ఇంట్లో ఓ మూలన పడి ఉన్న ఈ-చెత్తను బయట ఇష్టానుసారంగా విసిరేయడంతో పర్యావరణ కాలుష్యం జరుగుతోందని, ఇది ప్రజల ఆరోగ్యానికి కూడా హానికరమేనని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అధికారులు ఈ-వ్యర్థాల నిర్వహణపై శ్రద్ధ వహించాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచిస్తున్నారు. అంతటా ఎలక్ట్రానిక్ వ్యర్థాలు సేకరించి, వాటిని పునర్వినియోగం దిశగా చర్యలు చేపడితే భూ మండల కాలుష్యమనే మాట ఉండదని సలహా ఇస్తున్నారు.

ఈ-చెత్త సేకరణ ఏదీ?

ఉదయం నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు నిత్య జీవితంలో ఎలక్ట్రానిక్ వస్తువులు వినియోగించకుండా రోజు గడవదు. ఈ నేపథ్యంలో ఈ-వేస్ట్‌తో అటు భూ కాలుష్యం..ఇటు భవిష్యత్ తరాలకూ నష్టం వాటిల్లకుండా వినియోగించని పాత ఈ-వ్యర్థాల నిర్వహణకు ప్రభుత్వం ముందుకువచ్చింది. స్వచ్ఛాంధ్ర పేరిట ఈ-వేస్ట్ సేకరణను ప్రారంభించింది. ఈ ఏడాది ఏప్రిల్ నెలలోని మూడో శనివారం ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ నగరపాలక సంస్థకు ఈ-చెత్తను అప్పగించాలని ప్రచారం నిర్వహించింది. కొన్నిరోజుల పాటు ఈ ప్రక్రియ జరిగినా ఆ తర్వాత మరుగునపడింది. ఆ తర్వాత ప్రతి సచివాలయం పరిధిలో ఈ-వేస్ట్ సేకరణ చేస్తామని చెప్పినా ఆ దిశగా కార్యాచరణ ప్రారంభం కాలేదు. దీంతో పల్లె, పట్టణం, నగరమనే తేడా లేకుండా ఖాళీ స్థలాల్లో గుట్టలుగుట్టలుగా ఎలక్ట్రానిక్ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. ప్రచారార్భాటమే తప్ప ఏమీ లేదని ప్రజలంతా ప్రభుత్వ తీరును విమర్శిస్తున్నారు.

టన్నులు..టన్నులు..

ఐక్యరాజ్యసమితి లెక్కల ప్రకారం 2019లో 50 మిలియన్ టన్నులకు పైగా ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పోగయ్యాయి. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2011 జనాభా లెక్కల ప్రకారం 3 లక్షలకు పైగా జనాభా ఉంది. 70 వేలకు పైగా అసెస్‌మెంట్లు ఉన్నట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. ఈ పదేళ్లలో ఒక్కో ఇంట్లో సరాసరి పనికిరాని మూడేసి సెల్‌ఫోన్లు వ్యర్థాలుగా పేరుకుపోయాయి. పాత కంప్యూటర్ల స్థానంలో కొత్తవి రాగానే వాటిని కట్టి అటకెక్కిస్తున్నారు. ఇలా వేల కుటుంబాల్లో రెండు కంప్యూటర్లు, రెండు సీపీయూలు ఉండిపోయాయి. కీ బోర్డులు, మౌస్‌లు వంటి పరికరాలు నిరుపయోగంగా మారి ఇళ్లల్లోని ఫర్నిచర్ల మధ్య ఉండిపోతున్నాయి. ఇక టీవీలు, మిక్సీలు, గ్రైండర్లు, ఒవెన్‌లు వంటి సామగ్రికి లెక్కేలేదు. వీటన్నింటినీ సేకరించి పునర్వినియోగం చేస్తే పర్యావరణ హితానికి ఆస్కారం ఉంటుంది.

అలా ఉండిపోతే ప్రమాదమే..

ఎలక్ట్రానిక్ వ్యర్థాల్లో ఉండే కాడ్మియం, క్రోమియం, లెడ్, ప్లాస్టిక్ వంటివి బయట పడేస్తే కాలుష్యానికి కారణమవుతాయి. చాలామంది వాటిని బయట పారేయలేక ఇంట్లోనే అటకలపై ఉంచుకుంటున్నారు. అలా ఉంచిన వాటిని కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ-వేస్ట్ సేకరణ కేంద్రానికి అందిస్తే రీసైకిల్ చేస్తారు. సచివాలయాల్లో ఇటువంటి ప్రక్రియ ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. ఇప్పుడు నగరంలోని పాలాస్పత్రి వద్ద మాత్రమే ఈ-వ్యర్థాల సేకరణ చేయడం జరుగుతోంది. ఇప్పటివరకు 3,500 కిలోల వ్యర్థాలు సేకరించినట్లు అధికారులు చెబుతున్నారు. ఇలా సేకరించిన వ్యర్థాలను కాలుష్య నియంత్రణ మండలి చెప్పిన విశాఖకు చెందిన ఏజెన్సీ వారికి అందిస్తున్నామని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి తెలిపారు.

నేత్ర శస్త్రచికిత్సకు 50 మంది ఎంపిక



నేత్ర వైద్య తనిఖీలు చేస్తున్న వైద్య సిబ్బంది

భోగాపురం: నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక సాయి మందిరం వద్ద నేత్రదానంపై అవగాహన కల్పించడంతో పాటు ఉచిత నేత్రవైద్య శిబిరం గురువారం నిర్వహించారు. జిల్లా అంధత్వ సంస్థ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో మోపాడ పీహెచ్‌సీ ఆప్తాలమిక్ అధికారి మజ్జి గణపతిరావు..శిబిరానికి హాజరైన వారి కళ్లను తనిఖీ చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే కంటి ఆపరేషన్లకు 50 మందిని ఎంపిక చేసి వారికి ఉచితంగా ఆపరేషన్ చేయించేందుకు విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం నేత్రదానంపై చైతన్యం కల్పించారు. నేత్రదానానికి అందరూ ముందుకురావాలని, మనం చేసే నేత్రదానం ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపుతాయన్న విషయం మర్చిపోవద్దని తెలిపారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి సిబ్బంది, సత్యసాయి సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక మిమ్స్ వైద్య కళాశాల వైద్య విద్యార్థులు నేత్రదానంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రతిఒక్కరూ నేత్రదానానికి ముందుకురావాలని, మనం దానం చేసే కళ్లతో ఇద్దరు అంధులు లోకాన్ని చూడగలుగుతారని తద్వారా మన కళ్లు సజీవమన్న విషయం మర్చిపోకూడదని కళాశాల కంటి విభాగం హెచ్‌వోడీ వీణ తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం త్రినాథ్, డీన్ లక్ష్మీకుమార్, వైస్ ప్రిన్సిపాల్ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

విజయనగరం గంటస్తంభం: స్థానిక ఎస్‌డబ్ల్యూసీ మార్కెట్ కమిటీ ప్రాంతంలో సీఐటీయూ జిల్లా మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. అన్ని రంగాల కార్మికులు, చిరుద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేపడుతున్న ఈ సభలను అందరూ విజయవంతం చేయాలని నాయకులు కోరారు.

అన్నదాతలపై ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు

- మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ

పూసపాటిరేగ: అన్నదాతలపై ప్రభుత్వ నిర్లక్ష్యం తగదని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులకు కష్టాలు మొదలయ్యాయని విమర్శించారు. రైతులకు సరిపడ విత్తనాలు, ఎరువులను సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతుల సమస్యలపై పోరాటానికి సిద్ధమవుతున్నామని, ఈ నెల 9వ తేదీన జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద పోరుబాట కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రస్తుతం కూటమి సర్కారు హయాంలో వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో ఉందన్నారు. ఖరీఫ్ సాగుకు ముందు రైతులకు ఏ మేర విత్తనాలు, ఎరువులు అవసరమో తెలియదా అని ప్రశ్నించారు. గతంలోని వైఎస్సార్‌సీపీ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎటువంటి ఎరువులు, విత్తన ఇబ్బందులు లేకుండా చూశామన్నారు. ఇప్పుడు మార్క్‌ఫెడ్ చైర్మన్ జిల్లా వాసి అయినప్పటికీ రైతులకు సరిపడ ఎరువులు అందించడంలో జాప్యం జరుగుతుండడం విచారకరమన్నారు. ఎరువులు ఉన్నచోట ఒక్క పాస్‌బుక్‌కు ఒక్క బస్తా ఎరువులు మాత్రమే ఇచ్చారని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎరువుల కొరతపై రైతులు గోల పెడుతున్నా ఏం పట్టనట్లు ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాది కూడా అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయలేదన్నారు. ఆ తర్వాత ఆ పథకం ఇచ్చినా ఎంతోమంది అర్హులకు అన్యాయం జరిగిందన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, పిన్నింటి తమ్మునాయుడు, గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీలు ఎన్.సత్యనారాయణరాజు, ఎ.రమేష్, ఎస్. వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు



రక్తదాతలను అభినందిస్తున్న చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరిసహస్ర

విజయనగరం: జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు మజ్జి సిరిసహస్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఆయన నిత్యం ఆయురారోగ్యాలతో వర్ధిల్లేలా దీవించాలని పైడితల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమలు సమర్పించి, భక్తులకు ప్రసాదం పంచిపెట్టారు. అనంతరం వైష్ణవ వీధిలోని దివ్యాంగుల(మూగ, చెవిటి) పాఠశాలలో కేకు కట్ చేసి, పాఠశాల యాజమాన్యం కోరిక మేరకు వారికి ప్రింటర్, స్కానర్, జిరాక్స్ యంత్రం వితరణ చేశారు. అలాగే జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కేకు కట్ చేసి శ్రీనివాసరావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువురు రక్తదానం చేసి ఆయన పట్ల తమకున్న అభిమానం చాటుకున్నారు. అనంతరం రక్తదాతలను సిరిసహస్ర అభినందించారు.

ఐదుగురి అరెస్ట్

విజయనగరం క్రైమ్: నగర పరిధిలోని బాబామెట్ట, దాసన్నపేట ప్రాంతాల్లో రహస్యంగా నిర్వహిస్తున్న రెండు వ్యభిచార గృహాలపై సీఐ శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. వ్యభిచారం చేస్తూ పట్టుబడిన ఇద్దరు మహిళలు, ముగ్గురు పురుషులను పట్టుకుని అరెస్ట్ చేశారు. అక్కడ వ్యభిచారం జరుగుతున్నట్లు కంట్రోల్ రూమ్‌కు వచ్చిన సమాచారం మేరకు దాడులు చేసి వారిని పట్టుకుని సీఐ తెలిపారు.

ఘనంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం



విజయనగరం అర్బన్: రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు

విజయనగరం: సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకుని, జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మహాకవి గురజాడ అప్పారావు స్వగృహంలో వనిత వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన ఉపాధ్యాయుడి స్థాయి నుంచి దేశ ప్రథమ ఉపరాష్ట్రపతి, రెండో రాష్ట్రపతిగా ఎదిగిన వైనాన్ని వక్తలు వివరించారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, దేశ పౌరులను ఉత్తములుగా తీర్చిదిద్దిన ఘనత ఉపాధ్యాయులకే దక్కుతుందన్నారు. అంతటి గొప్ప వృత్తికి వన్నె తెచ్చిన రాధాకృష్ణన్ ఆశయాల సాధనకు కృషి చేయాలని కోరారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ ముళ్లపూడి సుభద్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం అర్బన్: మండలంలోని గాజులరేగలోని ఉన్న సీతం ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది అంతా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయులను నిర్వహించిన క్రీడాపోటీల్లోని విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్: స్థానిక సింహగిరి పారామెడికల్, ఒకేషనల్ జూనియర్ కళాశాలలో జరిగిన జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.దేవీమాధవి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దెంకాడ: మండలంలోని అక్కివరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఆ శాఖ ఈఈ జి.సురేష్‌బాబు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. విద్యుత్ మరమ్మతు పనుల నేపథ్యంలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాన్యం కల్లాలు, గొలగాం, గంట్లాం ఎస్సీకాలనీ, డి.తాళ్లవలస, టి.కల్లాలు గ్రామాలతో పాటు అక్కివరం ఏజీఎల్‌ఎస్‌లకు కరెంట్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

విజయనగరంఫోర్ట్: విద్యుత్ మరమ్మతు పనుల నేపథ్యంలో నగరంలోని డబుల్ కాలనీ, కేంద్రియ విద్యాలయం, ఏడు కోవెళ్లు, బాబామెట్ట ప్రాంతాలకు ఉదయం 7 నుంచి 11 గంటల వరకు, ద్వారకానగర్ మొదటి లైన్ నుంచి ఎనిమిదో లైన్ వరకు..అలాగే రాజానగర్ లేఅవుట్, విజ్జి స్టేడియం తదితర ప్రాంతాలకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ శాఖ ఈఈ త్రినాధరావు గురువారం తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నెల్లిమర్ల రూరల్: విద్యుత్ నిర్వహణ పనుల కారణంగా నెల్లిమర్ల పట్టణం సహా మొయిద, నారాయణపట్నం, పూతికపేట, కొండగుంపాం, గరికిపేట, చింతలపేట, పెదమజ్జిపేటలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

గవర్నర్ హోదాలో అలా మాట్లాడడం సరికాదు..

నెల్లిమర్ల రూరల్: పూసపాటి అశోక్‌గజపతిరాజు ఒక గవర్నర్ హోదాలో ఉండి రాజకీయాలు మాట్లాడడం ఎంతమాత్రం సరికాదని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు ఓ ప్రకటనలో గురువారం ఖండించారు. రుషికొండ ప్రభుత్వ భవనాలను ఉద్దేశించి, అశోక్‌గజపతిరాజు చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. ఆయన రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ఆ భవనాలను పిచ్చాసుపత్రిగా మారిస్తే బాగుంటుందని అనడం తీవ్ర విస్మయానికి గురిచేసిందన్నారు. ఆయన అత్యున్నత పదవిలో ఉన్నారని, హుందాగా మాట్లాడితే మంచిదన్నారు.

పారిశుధ్య వాహనాలు ప్రారంభం

విజయనగరం: స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య పనుల కోసం కొత్తగా కొనుగోలు చేసిన వాహనాలను ఎమ్మెల్యే పూసపాటి అదితిగజపతిరాజు నగరంలో గురువారం ప్రారంభించారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా రూ.3.57 కోట్ల వ్యయంతో ఓ జేసీబీ, రెండు కాంపాక్టర్ వాహనాలు సహా ఎనిమిది ట్రాక్టర్లు కొనుగోలు చేయడం జరిగిందని, వీటిని సద్వినియోగం చేసుకుని స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమ లక్ష్యం నెరవేరేలా చూడాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో కమిషనర్ పల్లి నల్లనయ్య, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, ఈఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాల వల్లే యూరియా కొరత

విజయనగరం రూరల్: వర్షాల కారణంగానే యూరియా కొరత ఏర్పడిందని డీసీసీబీ చైర్మన్, విజయనగరం టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. ఇదే విషయమై ఆయన స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి సాగుకు అధిక మొత్తంలో రైతులు ముందుకురావడం, వర్షాలు కూడా ఎక్కువగా కురవడం వల్ల రైతులకు సరిపడ యూరియా సరఫరాలో లోటు ఏర్పడిందని, దీనిని అధిగమించి, రైతులకు అవసరమైన యూరియా పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

తక్షణమే సరఫరా చేయాలి..

నెల్లిమర్ల: తక్షణమే రైతులకు అవసరమైన యూరియా సరఫరా చేయాలని రైతు సంఘం నాయకుడు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం రైతులకు యూరియా ఎంతో అవసరమని, దానికి తగ్గట్టుగా ప్రభుత్వం వెంటనే యూరియా పంపిణీ చేయాలని కోరారు. వేల సంఖ్యల్లో రైతులు యూరియా కావాలని అడుగుతుంటే వందల బస్తాలు సరఫరా చేస్తుండడం దారుణమన్నారు. ఇప్పటికైనా రైతుల అవసరం మేర యూరియా సరఫరా చేయాలని లేకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

అంబేడ్కర్ భవన పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు

విజయనగరం టౌన్: కలెక్టరేట్ వెనుక ఉన్న అంబేడ్కర్ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో భవన పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు చేశామని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.అన్నపూర్ణమ్మ తెలిపారు. ఇదే విషయమై ఆమె నగరంలోని తన కార్యాలయం వద్ద దళిత సంఘాల నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. పీపీపీ పద్ధతిలో నిర్మాణం చేయడం జరుగుతుందని, గ్రౌండ్ ఫ్లోర్‌లో షాపులు, మొదటి అంతస్తులో దళితుల పెళ్లిళ్లకు పనికి వచ్చేలా కల్యాణ మండపం నిర్మాణానికి తీర్మానాలు చేయడం జరిగిందని తెలిపారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

పూసపాటిరేగ: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్రతి ఒక్కరూ సామాజిక అడవుల పెంపకానికి ముందుకురావాలని ఫారెస్ట్ రేంజర్ డి.సింధు కోరారు. గ్రీన్ కవర్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోనాడ, బీజీపేట, తిప్పలవలస గ్రామాల పరిసరాల్లో తాటిచెట్ల పెంపకానికి తాటి టెంకలు గురువారం నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ



విజయనగరం టౌన్: జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారిగా షేక్ మహబూబ్ షరీఫ్ గురు వారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆయనకు ఆ శాఖ అధికారులు, సిబ్బంది స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.